క్లుప్తంగా

ఆంజనేయస్వామి వారికి ప్రత్యేక పూజలు



స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు

కొడంగల్ రూరల్: పట్టణశివారులోని సిద్దనొంపు పడమటి ఆంజనేయ స్వామివారి ఆలయంలో శనివారం హిందూవాహిని, ఆర్‌ఎస్‌ఎస్ సంయుక్త ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం స్వామివారికి అభిషేకం, అష్టోత్తర శతనామావళి, ధూపదీప, నైవేద్యాలను సమర్పిస్తూ మంగళహారతులు ఇచ్చారు. అనంతరం సామూహిక హనుమాన్ చాలీసా పారాయణం చేశారు. ప్రతీవారం నిర్వహించనున్న కార్యక్రమాలకు భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామివారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

యూనిక్ రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి

ఏఈఓ ఐసాక్ హెరాల్డ్



యూనిక్ రిజిస్ట్రీ చేస్తున్న ఏఈఓ ఐసాక్ హెరాల్డ్

కొడంగల్ రూరల్: రైతులు యూనిక్ రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని ఏఈఓ ఐసాక్ హెరాల్డ్ అన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఫార్మర్ రిజిస్ట్రీలో తమ వివరాలు నమోదు చేయించుకోవాలని ఆయన తెలిపారు. శనివారం పట్టణంలోని వ్యవసాయ శాఖ కార్యాలయంలో యూనిక్ రిజిస్ట్రీని ప్రారంభించారు. ఈ సందర్భంగా రైతులకు పలు సూచనలందిస్తూ భూమి ఉన్న రైతులు యూనిక్ రిజిస్ట్రీలో తమ పేర్లను నమోదు చేసుకోవాలని, ఆధార్ కార్డు తరహాలోనే రైతుకు యూనిక్ నంబర్ కేటాయిస్తారన్నారు.

ప్రజాస్వామ్యాన్ని అవహేళన చేయడం బాధాకరం

- యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జగదీశ్
- నితిష్‌కుమార్, ప్రధాని మోదీ దిష్టి బొమ్మల ఊరేగింపు



దిష్టి బొమ్మలను ఊరేగిస్తున్న యూత్ కాంగ్రెస్ నాయకులు

మర్పల్లి: ప్రజాస్వామ్యాన్ని అవహేళన చేయడం బాధాకరమని యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జగదీశ్ పేర్కొన్నారు. బీహార్‌లో దళిత విద్యార్థుల సమస్యలు తెలుసుకునేందుకు దర్‌బర్గా వెళ్తున్న రాహుల్‌గాంధీని కలవనీయకుండా సీఎం నితీష్‌కుమార్ పోలీసులచే అడ్డుకోవడం హేయమైన చర్యనన్నారు. ముమ్మాటికి ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడమేనన్నారు. దీన్ని నిరసిస్తూ శనివారం మండల కేంద్రంలో యూత్ కాంగ్రెస్ నాయకులు నితీష్‌కుమార్, ప్రధాని మోదీ దిష్టిబొమ్మలను పార్టీ కార్యాలయం నుంచి కొత్త బస్టాండ్ వరకు ఊరేగించారు. వారికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం దిష్టి బొమ్మలను రోడ్డుపై ఉంచి దహనం చేశారు. ఈ కార్యక్రమంలో నియోజక వర్గం యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు నిఖిల్‌రెడ్డి, బీసీ సెల్ మండల అధ్యక్షుడు సర్వేష్, మండల ఉపాధ్యక్షుడు నందు ప్రకాశ్, ఆయా గ్రామాల యువజన నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నూతన ప్రెస్‌క్లబ్ నేతలకు ఘన సన్మానం



ప్రెస్‌క్లబ్ ప్రతినిధులను సన్మానిస్తున్న దళిత సంఘాల నాయకులు

కుల్కచర్ల: కుల్కచర్ల మండల నూతన ప్రెస్‌క్లబ్ ప్రతినిధులను మండల దళిత సంఘాల నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమాజంలో పాత్రికేయుల పాత్ర ఎంతో కీలకమన్నారు. ఈ కార్యక్రమంలో తుప్పలి ఆనంద్‌కుమార్, బైండ్ల బాలకృష్ణారావు, వెంకట్రాములు, చుక్కయ్య, జె.వెంకటయ్య, రవి, టీయూడబ్ల్యూజే, ఐజేయూ తాలుకా అధ్యక్షుడు శివకుమార్, మండల కమిటీ అధ్యక్షుడు పాండు, ప్రధాన కార్యదర్శి చందు, ఉపాధ్యక్షుడు రమేష్, కోశాధికారి గణేష్, కార్యదర్శి అరవింద్ స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు పక్కనే వ్యర్థజలాల పారబోత

- నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న ఏజెన్సీలు
- ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రజలు
- పట్టించుకోని అధికారులు



చింతల్‌చెరువులో వ్యర్థాలను పారబోస్తున్న ఏజెన్సీలు

పరిగి: ఎక్కడ పడితే అక్కడ వ్యర్థ జలాలను పారబోస్తున్నారు. దీంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఏజెన్సీలు వాటిని నిర్దేశించిన ప్రదేశంలో పారబోయాల్సి ఉండగా కొందరు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ రోడ్డు పక్కనే పారబోస్తున్నారు. చుట్టుపక్కల ప్రజలకు ఇక్కట్లు కలిగిస్తున్నారు. సెప్టిక్ ట్యాంక్‌ల ద్వారా వ్యర్థాలను సేకరించి మండలంలోని చింతల్ చెరువులో రోడ్డు పక్కన పారేస్తున్నారు. చుట్టుపక్కల వారు అక్కడ వ్యర్థాలను పారబోయొద్దని చెప్పినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చెరువులో వ్యర్థాలను పారబోయడంతో కలుషితమైన నీటిజలాలను పశువులు తాగి మృత్యువాత పడుతున్నాయని చెబుతున్నారు. కొన్ని రోగాల బారిన పడుతున్నాయన్నారు. అంతే కాకా చుట్టు పక్కల రైతులకు దుర్వాస వెదజల్లుతుందని ఫిర్యాదు చేస్తున్నారు. ఎక్కడ పడితే అక్కడ వ్యర్థాలను పారబోస్తున్న ఏజెన్సీలపై అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

ఈ పాస్ మిషన్ల ద్వారా అందించాలి

వ్యవసాయ శాఖ అధికారులు



ఈ పాస్ మిషన్లు అందుకుంటున్న ఫర్టిలైజర్స్ దుకాణదారులు

కొడంగల్ రూరల్: ఫర్టిలైజర్ దుకాణదారులు ఈ పాస్ మిషన్ల ద్వారా రైతులకు ఎరువులు విక్రయించాలని వ్యవసాయ శాఖ అధికారులు తెలిపారు. శనివారం మండల పరిధిలోని పర్సాపూర్ గ్రామంలోని రైతు వేదికలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో కోరమండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ ఆధ్వర్యంలో నియోజకవర్గంలోని ఫర్టిలైజర్స్ దుకాణదారులకు ఈ పాస్ మిషన్లు అందజేశారు. దుకాణదారులు ఈ పాస్ మిషన్ల ద్వారా అమ్మకాలు కొనసాగిస్తే దుకాణంలో స్టాకు వివరాలు ఎప్పటికప్పుడు తెలుస్తుందని వ్యవసాయశాఖాధికారులు అన్నారు. రైతు ఆధార్‌కార్డు నంబర్‌ను, రైతు వేలు ముద్రను జత చేయడంతో రశీదు వస్తుందని తెలిపారు. గతంలో ఇచ్చిన ఈ పాస్ మిషన్లు చెడిపోవడంతో కొత్తవి పంపిణీచేస్తున్నట్లు పేర్కొన్నారు. నియోజకవర్గంలో మొత్తం 90మంది డీలర్లకు అందించినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో దౌల్తాబాద్ ఏఓ లావణ్య, బొంరాస్‌పేట ఏఓ మొగులప్ప, దుద్యాల్ ఏఓ నాగరాజు, ఏఈఓ అశ్విని, పీఏసీఎస్ చైర్మన్ కటుకం శివకుమార్ గుప్తా, కోరమండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ సభ్యులు శ్రీకాంత్, రమేష్, వ్యవసాయశాఖాధికారులు, ఫర్టిలైజర్స్ దుకాణదారులు పాల్గొన్నారు.

క్రీడలతో శారీరక, మానసిక ఆరోగ్యం



విజేతలకు ట్రోఫీ అందజేస్తున్న గ్రామస్తులు

బొంపల్లి గ్రామస్తులు

దోమ: క్రీడలతో శారీరక, మానసిక ఆరోగ్యం చేకూరుతుందని బొంపల్లి గ్రామస్తులు పేర్కొన్నారు. బొంపల్లిలో నిర్వహించిన బీపీఎల్ క్రికెట్ లీగ్ టీ20 ముగింపు సందర్భంగా విజేతలకు నిర్వాహకులు బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..బీపీఎల్ క్రికెట్ లీగ్ టోర్నమెంట్‌లో ఆరు టీంలు పాల్గొనగా ప్రతీరోజు రెండు టీంలకు పోటీలు నిర్వహించారు. శనివారం ఫైనల్ మ్యాచ్ నిర్వహించారు. బీపీఎల్ రైజర్స్ టీమ్ మొదటి విజేతగా నిలవగా, బొంపల్లి వారియర్స్ రెండో విజేతగా నిలిచారు. మొదటి బహుమతి రూ.10వేలను గ్రామనికి చెందిన ఆర్. అంతిరెడ్డి, రెండో బహుమతిని గుడిసె రాములు ముదిరాజ్ రూ.5వేలు, రూ.15 వేల ట్రోఫీని బోయిని చంద్రశేఖర్ ముదిరాజ్ అందజేశారు. ఫైనల్ మ్యాచ్ చూసేందుకు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో రావడంతో నిర్వాహకులు మాజీ ఎంపీటీసీ రాములు, కానిస్టేబుల్ సురేష్ సహకారంతో అన్నదానం చేశారు. ప్రతి టీంలో క్రీడాకారులు క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించారన్నారు.

తహసీల్దార్ వెంకటేశ్ బదిలీ



బషీరాబాద్: మండల తహసీల్దార్ వై వెంకటేశ్ సంగారెడ్డి జిల్లాకు బదిలీ అయ్యారు. ఈ మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. 2024, ఫిబ్రవరి 13న బొంరాస్‌పేట్ మండలం నుంచి బషీరాబాద్ తహసీల్దార్‌గా వచ్చిన ఆయన 16 నెలల పాటు ఇక్కడ విధులు నిర్వర్తించారు. ఆయన స్థానంలో గద్వాల్ జిల్లా మల్దకల్ మండల తహీల్దార్‌గా పనిచేసిన షాహిదాబేగం రానున్నట్లు తెలిసింది.

నేడు విద్యుత్ అంతరాయం

బంట్వారం: కోట్‌పల్లి మండలంలోని బార్వాద్ సబ్‌స్టేషన్ పరిధిలో చెట్ల కొమ్మల తొలగింపు కారణంగా ఆదివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతందని ట్రాన్స్‌కో ఏఈ ప్రసాద్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కరీంపూర్ ఫీడర్ కింద మోత్కుపల్లి, నాగసాన్‌పల్లి, బీరోల్, కరీంపూర్ గ్రామాల్లో పనులు నిర్వహిస్తారని తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపేస్తారని పేర్కొన్నారు. ఈ విషయాన్ని విద్యుత్ వినియోగదారులు గ్రహించి ట్రాన్స్‌కో సిబ్బందికి సహకరించాలని ఆయన కోరారు.

మూడు గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు

ధారూరు: మండల పరిధిలోని తరిగోపుల, మైలారం, నాగ్‌సాన్‌పల్లి గ్రామాల్లో శనివారం తహసీల్దార్లు సాజిదాబేగం, శ్రీనివాస్, దీపక్ సాంసన్‌లు భూభారతి రెవెన్యూ సదస్సులను నిర్వహించారు. నాగ్‌సాన్‌పల్లిలో నిర్వహించిన సదస్సులో ముగ్గురు రైతులు సమస్యలపై దరఖాస్తులు అందజేశారు. ఇందులో భూవిస్తీర్ణం సవరణ కోసం ఒకటి, మ్యుటేషన్ కోసం ఇద్దరు దరఖాస్తులు అందజేశారు. తరిగోపుల గ్రామంలో రైతుల నుంచి అత్యధికంగా దరఖాస్తులు అందాయి. ఇందులో మిస్సింగ్ సర్వేనంబర్ల కోసం 23మంది రైతులు, పెండింగ్ మ్యుటేషన్ల కోసం నలుగురు, డీఎస్ పెండింగ్ కోసం 10 మంది, భూవిస్తీర్ణం సవరణ కోసం 8 మంది, సక్సేషన్‌కు 9మంది, పేర్లు మార్పు కోసం ముగ్గురు, కొత్త పట్టాదారు పాసుబుక్కుల కోసం నలుగురు, ఇతర సమస్యలపై మరో ఇద్దరు అందజేశారు. మైలారం గ్రామంలో మ్యుటేషన్, డీఎస్ పెండింగ్, భూవిస్తీర్ణ సవరణ కోసం ఒక్కో రైతు దరఖాస్తు చేయగా లింగమార్పుకు ముగ్గురు, ఇతర సమస్యలపై ఇద్దరు రైతులు దరఖాస్తులు చేశారు. ఈ సదస్సుల్లో డీటీ విజయేందర్, ఆర్ఐ స్వప్న, రెవెన్యూ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య

ఎంఈఓ లక్ష్మణ్‌నాయక్

షాబాద్: ప్రభుత్వ పాఠశాలల్లో ప్రైవేట్‌కు దీటుగా విద్యార్థులకు నాణ్యమైన బోధన అందుతుందని ఎంఈఓ లక్ష్మణ్‌నాయక్ పేర్కొన్నారు. శనివారం మండల పరిధిలోని ఎల్గొండగూడ గ్రామంలో బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో ప్రైవేట్ పాఠశాలకు వెళ్తున్న 25 మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలో అడ్మిషన్ తీసుకున్నారు. మిగతా 15 మంది విద్యార్థులను కూడా తమ పాఠశాలల్లో చేర్పిస్తామని వారి తల్లిదండ్రులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యతో పాటు ఉచితంగా యూనిఫాం, పుస్తకాలు అందిస్తున్నామన్నారు. ప్రభుత్వ బడుల్లో అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు ఉంటారని, మధ్యాహ్న భోజనం ఉంటుందని పేర్కొన్నారు. ఈ ఏడాది ప్రైవేట్‌కు దీటుగా ఉత్తమ ఫలితాలు సాధించామని గుర్తుచేశారు. అమ్మ ఆదర్శ పాఠశాల ద్వారా మౌలిక వసతులు కల్పిస్తున్నామని, పిల్లలను నిర్భయంగా చేర్పించవచ్చన్నారు. అనంతరం పాఠశాలలో ప్రహరీ నిర్మాణ పనులకు దాత రవీందర్‌రెడ్డితో కలిసి ఎంఈఓ భూమిపూజ చేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు రవీందర్‌రెడ్డి, ఆంజనేయులుగౌడ్, యాదయ్య, బల్‌రాం, శ్రీనివాస్ చారి, మల్లారెడ్డి, సతీష్, రవి, శేఖర్, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు తదితరులు ఉన్నారు.

పోలీసుల పాత్ర కీలకం

- కుల్కచర్ల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఆంజనేయులు
- నూతన ఎస్ఐ రమేశ్‌ను సన్మానించిన నేతలు



ఎస్ఐ రమేశ్‌ను సన్మానిస్తున్న నేతలు

కుల్కచర్ల: శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసుల పాత్ర కీలకమని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఆంజనేయులు పేర్కొన్నారు. శనివారం కుల్కచర్ల మండల నూతన ఎస్ఐగా బాధ్యతలు స్వీకరించిన ఎస్ఐ రమేశ్‌ను కాంగ్రెస్ నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..గ్రామీణ ప్రాంతంలోని పేదలకు సమాజం, చట్టాలపై సరైన అవగాహన లేకపోవడంతో క్షణికావేశంలో గొడవలు పెట్టుకుటుంన్నారన్నారు. ఈ కార్యక్రమంలో పాంబండ ఆలయ చైర్మన్ కోట్ల మైపాల్ రెడ్డి, మండల కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి గోపాల్ నాయక్, మాజీ ఎంపీపీ అంజిలయ్య, యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జంగయ్య, బీసీ సెల్ అధ్యక్షుడు మహేశ్, ఎస్టీ సెల్ మండల అధ్యక్షుడు రాంచందర్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ భరత్‌కుమార్ రెడ్డి, రవి తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తులు అందజేయడానికి మరో అవకాశం



హస్నాబాద్‌లో రాజీవ్ యువ వికాసం దరఖాస్తు తీసుకుంటున్న పంచాయతీ కార్యదర్శి కృష్ణవేణి

దుద్యాల్: రాజీవ్ యువ వికాసం దరఖాస్తులను అందజేయడానికి ప్రభుత్వం మరో అవకాశం ఇచ్చింది. గతంలో యువత, నిరుద్యోగులు అధిక సంఖ్యలో దరఖాస్తు చేసుకున్నారు. ఈ ఫారాలను ఎంపీడీవో కార్యాలయంలో అందించాల్సి ఉండగా కొందరు గడువునాటికి సమర్పించారు. మరికొందరు ఇవ్వలేకపోయారు. అలాంటి వారికి ప్రభుత్వం మరో అవకాశం కల్పించింది. దరఖాస్తు కాపీలను గ్రామ పంచాయతీ కార్యాలయంలో సమర్పించాలనే నిబంధన ఉండడంతో కొందరు సమర్పించలేదు. ప్రస్తుతం పంచాయతీ కార్యదర్శులు దరఖాస్తు ఫారాలను తీసుకుంటున్నారు. దరఖాస్తు చేసుకున్న నిరుద్యోగులు నేటికి కూడా సమర్పించలేదని కార్యదర్శులు వాపోతున్నారు. త్వరలోనే లబ్ధిదారుల ఎంపిక జాబితాను సిద్ధం చేస్తామన్నారు. ఆదివారం వరకు దరఖాస్తుదారులు కాపీలను సమర్పించాలని మండలంలోని అన్ని గ్రామాల కార్యదర్శులు కోరారు. మొత్తం 1,529 మంది దరఖాస్తు చేసుకోగా 1,414 మంది సమర్పించారని ఎంపీడీవో కార్యాలయం సూపరింటెండెంట్ శ్రీనివాసులు తెలిపారు.

కష్టపడిన వారికి తగిన గుర్తింపు



రాంచందర్‌కు నియామకపత్రం అందజేస్తున్న నాయకులు

కాంగ్రెస్ చేవెళ్ల అసెంబ్లీ ఇన్‌చార్జి పామెన భీంభరత్

షాబాద్: పార్టీలో కష్టపడి పనిచేసిన వారికి తప్పకుండా పదవులు లభిస్తాయని కాంగ్రెస్ పార్టీ చేవెళ్ల అసెంబ్లీ ఇన్‌చార్జి పామెన భీంభరత్, జిల్లా సేవాదళ్ అధ్యక్షుడు పొగాకు రమాకాంత్‌రావు పేర్కొన్నారు. శనివారం షాబాద్‌లో కార్యకర్తల సమావేశం నిర్వహించారు. మండల పరిధిలోని కేసారం గ్రామానికి చెందిన తొంట రాంచందర్‌ను చేవెళ్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సేవాదళ్ అధ్యక్షుడిగా నియమించి నియామకపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పార్టీ బలోపేతానికి నిత్యం కృషి చేసిన కార్యకర్తలకు, నాయకులకు స్థానిక సంస్థల ఎన్నికలు, సంస్థాగత ఎన్నికలలో ప్రాధాన్యత ఇస్తామని స్పష్టం చేశారు. గడిచిన 15 నెలలోనే అనేక అభివృద్ధి కార్యక్రమాలకు కాంగ్రెస్ ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. పార్టీ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ శ్రీరాం రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి పమెన భార్గవ్‌రామ్, చేవెళ్ల నియోజకవర్గ మాజీ యూత్ అధ్యక్షుడు పెంటారెడ్డి, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ పామెన నర్సింలు, మంగలి చెన్నయ్య, మాజీ సర్పంచ్ బర్ల యాదయ్య, మార్కెట్ కమిటీ చేవెళ్ల నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి చర్ల సంతోష్‌రెడ్డి, మండల యూత్ అధ్యక్షుడు సురేందర్, నాయకులు బందయ్య, కుమార్, నర్సింలు, సాయి, కిరణ్‌రెడ్డి, ఖలీల్‌పాషా, వెంకటయ్య, వేణుగోపాల్, అమరేందర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

తాగు నీటికి ఇబ్బందులు

పట్టించుకోని అధికారులు

బంట్వారం: కోట్‌పల్లి మండల కేంద్రంలోని పలు వార్డుల్లో తాగునీటికి ఇబ్బందులు మొదలయ్యాయి. అసలే మండుతున్న ఎండలు దీనికి తోడు నీటి సమస్యతో ప్రజలు తీవ్ర ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. కాలనీలో బోరు చెడిపోవడంతో వారు బైకులపై దూరప్రాంతాల నుంచి నీరు తెచ్చుకుంటున్నారు. గ్రామంలో తరచుగా బోర్లు చెడిపోతున్నా సకాలంలో బాగు చేయించడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఒకటి, రెండు వార్డుల్లో నీటి సరఫరా నిలిచిపోయి నాలుగు రోజులవుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మిషన్ భగీరథ నీరు కూడా సక్రమంగా రావడం లేదన్నారు. నీటి సమస్యను పరిష్కరించకుంటే ఖాళీ బిందెలతో మండల పరిషత్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని పలువురు మహిళలు హెచ్చరించారు.

వైభవంగా పార్వతి పరమేశ్వరుల కల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న పండితులు

పూడూరు: మండల పరిధిలోని అంగడిచిట్టంపల్లి గ్రామంలో పార్వతి పరమేశ్వరుల కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. శనివారం ఉదయం తెల్లవారు ఝామున అగ్నిగుండం నిర్వహించారు. స్వామివారి ఉత్సవ విగ్రహాలను ఊరేగింపుగా తెచ్చి ఆలయ ప్రాంగణంలో కల్యాణం నిర్వహించారు. వేద మంత్రోచ్ఛరణల మధ్య గ్రామం మారుమ్రోగింది. చిన్నా, పెద్ద తేడాలేకుండా పాల్గొన్నారు. గ్రామానికి చెందిన బక్క రాజు దంపతులు స్వామివారి కల్యాణాన్ని నిర్వహించారు. కారూరి రవి దంపతులు అన్నదానం చేశారు. సాయంత్రం ఉత్సవ విగ్రహాలను ఊరేగించారు.

గన్ని బ్యాగులు ఇవ్వడం లేదని నిరసన



తహసీల్దార్ మురళీధర్‌కు వినతిపత్రం అందజేస్తున్న రైతులు

తహసీల్దార్ మురళీధర్‌కు వినతిపత్రం అందజేత

కుల్కచర్ల: వరి ధాన్యం సేకరణలో తమకు గన్ని బ్యాగులు ఇవ్వడం లేదని శనివారం కుస్మసముద్రం గ్రామానికి చెందిన పలువురు రైతులు కుల్కచర్ల ప్రధాన చౌరస్తాలో బైఠాయించి ఆందోళన వ్యక్తం చేశారు. అనంతరం తహసీల్దార్ మురళీధర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ గ్రామంలో రైతులకు సరిపడ సంచులు ఇవ్వడంలేదని, ఇప్పటివరకు 3వేల సంచులు మాత్రమే ఇచ్చారన్నారు. కానీ గ్రామం మొత్తంలో 20వేల సంచులు అవసరమవుతాయన్నారు. ఈ విషయంలో అధికారులు, నిర్వాహకులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తమకు అవసరమైన మేరకు సంచులు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో శ్రీశైలం, చెన్నయ్య, హెమ్లీబాయి తదితర రైతులు పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి కృషి

వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పట్లోళ్ల బాల్‌రెడ్డి



బాల్‌రెడ్డిని సన్మానిస్తున్న ఆలయ నిర్వాహకులు

తాండూరు రూరల్: తట్టెపల్లి గ్రామ శివారులోని అంబురామేశ్వర స్వామి దేవాలయ అభివృద్ధికి కృషి చేస్తానని తాండూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పట్లోళ్ల బాల్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం అంబురామేశ్వర ఆలయంలో శివుడికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అటవీప్రాంతంలో ఈ ఆలయం ఆహ్లాదకరమైన వాతవారణంలో ఉందన్నారు. ఆలయ అభివృద్ధికి ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తానని చెప్పారు. అనంతరం నిర్వాహకులు మార్కెట్ కమిటీ చైర్మన్ బాల్‌రెడ్డిని శాలువా కప్పి సన్మానించారు. ఈ కార్యక్రమంలో తట్టేపల్లి పీఏసీఎస్ చైర్మన్ లక్ష్మారెడ్డి, నాయకులు బిచ్చిరెడ్డి, నరేందర్, సుమిత్ర రాథోడ్, లక్ష్మణ్, వెంకట్‌రెడ్డి, రాజు, ఉదయ్‌భాస్కర్‌రెడ్డి, జర్నప్ప తదితరులు పాల్గొన్నారు.

వర్షానికి తడిసిన రేషన్ బియ్యం



గాలికి రేకులు ఎగిరిపోవడంతో తడిసిన బియ్యం

పూడూరు: శనివారం సాయంత్రం కురిసిన వర్షానికి రేషన్ షాప్ రేకులు ఎగిరిపడి అందులోని బియ్యం సంచులు పాక్షికంగా తడిసిపోయాయి. వివరాలు ఇలా ఉన్నాయి.. మండల పరిధిలోని మంచన్‌పల్లి గ్రామంలో ఈదురుగాలులతో కూడిన వర్షం కురియడంతో రేషన్ దుఖాణం రేకులు ఎగిరిపడ్డాయి. దీంతో అందులో ఉన్న బియ్యం తడిసిపోయాయి. ఈ నెల 20వరకు రేషన్ బియ్యం తీసుకోవడానికి గడువు ఉందని రేషన్ కార్డు దారులు త్వరగా బియ్యాన్ని తీసుకోవాలని డీలర్ తెలిపారు.

బీజేపీ మండల అధ్యక్షురాలిగా అనసూయ



పరిగి: బీజేపీ మండల అధ్యక్షురాలిగా నీరటి అనసూయను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రూప్‌ఖాన్‌పేట్ గ్రామానికి చెందిన అనసూయ మహిళా ప్రజాప్రతినిధిగా, సర్పంచ్‌గా ప్రజలకు ఎన్నో సేవలు చేశారు. ఆమె సేవలను గుర్తించి బీజేపీ మండల అధ్యక్షురాలిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి ప్రకటించారు. ఈ సందర్భంగా అనసూయ మాట్లాడుతూ బీజేపీ అభ్యున్నతికి తాను నిరంతరం కృషి చేస్తానన్నారు. ఉమ్మడి జిల్లాలోనే బీజేపీ సర్పంచ్‌గా ప్రజలకు సేవచేశానని గుర్తు చేశారు. మండల అధ్యక్షురాలిగా పార్టీ నన్ను ఎన్నుకున్నందుకు పార్టీ కోసం మరింత సమయం వెచ్చించి పార్టీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు. మండలంలో అన్ని గ్రామాల్లోని కార్యకర్తలు, నాయకులను సంఘటితం చేసి కేంద్ర ప్రభుత్వం ప్రజలకు అందిస్తున్న పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్తానన్నారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో అధిక సీట్లను గెలిపించుకుని పార్టీని మరింత ముందుకు తీసుకెళ్తానన్నారు.